# పట్టు వైపు..రైతుల చూపు

- తక్కువ శ్రమతో అధిక లాభాలు
- ప్రతినెలా ఆదాయం
- పది మందికి ఉపాధి
- 268 ఎకరాల్లో మల్బరీ తోటల సాగు



పట్టుపురుగులు ఆకు తింటున్న తీరును పరిశీలిస్తున్న ఈ రైతు పేరు కిషన్‌రెడ్డి. ఇతడిది రామడుగు మండలం గోపాల్‌రావుపేట. తనకున్న రెండెకరాల్లో గతంలో అరటి, బొప్పాయి వంటి పంటలు వేశాడు. అధికారుల సూచనల మేరకు ఐదేళ్ల నుంచి పట్టు సాగువైపు మళ్లారు. ప్రస్తుతం 250 గుడ్ల వరకు పెంచుతున్నారు. ప్రతి నెలా రెండున్నర క్వింటాళ్ల పట్టుగూళ్లు దిగుబడి తీస్తున్నారు. ఏడాదికి పది పంటలు తీస్తున్నాడు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పట్టుగూళ్ల ధర రూ.500వరకు ఉంది. ఒక్కో పంటకు రూ.20 వేల వరకు ఖర్చు ఉంటుందని, సంప్రదాయ పంటలతో పోల్చితే పట్టు ద్వారా ప్రతి నెలా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నాడు.



పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సెరికల్చర్ అధికారి జగన్‌రావు



మల్బరీ తోటను చూపిస్తున్న ఈ రైతు పేరు కనుకుల లక్ష్మారెడ్డి. ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లె సొంతూరు. తనకున్న పన్నెండెకరాల్లో రెండెకరాల్లో ఐదేళ్ల క్రితం మల్బరీ సాగు చేసి, పట్టు పురుగులు పెంచుతున్నాడు. ఒక్కో బ్యాచ్‌లో 300 గుడ్లు పెంచుతున్నాడు. నాణ్యమైన మల్బరీ ఆకుతోనే మంచి పట్టు దిగుబడి సాధి స్తున్నాడు. గతంలో సాగుచేసిన పసుపు, అరటి, పత్తి, వరి, ఇతర పంటలతో పోల్చు కుంటే పట్టు సాగులో ఖర్చు తక్కువ, ఆదాయంఎ క్కువగా ఉందంటున్నారు. అవగాహన లేక మొదటి మూడు బ్యాచ్‌ల వరకు కొంత ఇబ్బంది పడ్డానని, అధికారుల సూచనలతో అవగాహన పెంచుకోవడంతో ఇప్పుడు ఏ సమస్యా లేదంటున్నాడు. మంచి ఆదాయం వస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

ముకరంపుర, జూలై 3: రైతులు సంప్రదాయ సాగుకు స్వస్తిచెప్పి విభిన్న పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పట్టు పురుగుల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. సర్కారు ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుంటూ లాభాల బాటలో ముందుకెళ్తున్నారు. ప్రతినెలా రాబడి వస్తుండడంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. ప్రస్తుతం తగినంత ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్‌లో పట్టుకు మంచి డిమాండ్ ఉన్నది. ప్రభుత్వమే పట్టు గూళ్లు కొనుగోలు చేయడం. గతంతో పోల్చితే మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడం, తక్కువ శ్రమ, నీటి వినియోగంతో ఏటా ఎనిమది పంటలు తీస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు.

### 92 మంది రైతులు.. 268 ఎకరాలు..

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం లభించే పట్టు పురుగుల పెంపకానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 92మంది రైతులు 268ఎకరాల్లో మల్బరీని సాగు చేస్తూ పట్టు పురుగులను పెంచుతున్నారు. ఎకరం వరి సాగుచేసే నీటితో మూడెకరాల మల్బరీ తోటను పెంచవచ్చు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టిన రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలిస్తున్నారు.

### ఏడాదికి ఎనిమిది పంటలు..

పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టిన రైతులు ఏడాదిలో సగటునా ఎనిమిది పంటలు తీయవచ్చు. మల్బరీ తోటల్లో ఆకు లభ్యత బాగున్న వారు పది పంటలు కూడా తీస్తున్నారు. పట్టు పు రుగు జీవితచక్రంలో గుడ్డు దశ నుంచి గూడు అల్లే వరకు ఐదు దశలు ఉంటాయి. మొత్తం నెల రోజుల్లో పట్టుగూళ్లు చేతికి వస్తాయి. ప్రస్తుతం చాకీ కేంద్రాల ద్వారా రెండో దశలో ఉన్న పట్టు పురుగులను రైతులకు అందిస్తున్నారు. ఇవి తొమ్మిది రోజుల వయస్సు ఉండి, రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాయి. రైతులు వీటిని షెడ్లలో వేసి, నాణ్యమైన మల్బరీ ఆకును ఆహారంగా అందిస్తా రు. 21రోజుల్లో మిగిలిన మూడు దశల్లో పురుగులు పట్టుగూళ్లను అల్లుతాయి. 100 గుడ్లకు 80నుంచి 100 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతాయి. ఒక పంట తీసిన త ర్వాత మరో బ్యాచ్ కోసం తిరిగి షెడ్డును పూర్తిగా డిస్‌ఇన్ఫెక్టెడ్ చేస్తారు. 100గుడ్లను పెంచడానికి రెండెకరాల్లో మల్బరీ తోటను పెంచాల్సి ఉంటుంది. 100 గుడ్లకు 80 నుంచి 100 కిలోల వరకు పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతాయి. సగటున 80కిలోల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పట్టుగూళ్ల ధర కిలోకు రూ.500 వరకు ఉంది. సగటునా కిలోకు రూ.450చొప్పున విక్రయించినా 80కిలోలకు రూ.36వేల ఆదాయం వస్తుంది. ఇలా ఏడాదిలో 8సార్లు పట్టుగూళ్లను ఉత్ప త్తి చేయవచ్చు.

### శాస్త్రీయ పద్ధతులు

పట్టు పురుగుల పెంపకంలో శాస్త్రీయ విధానాలే నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తికి దో హదం చేస్తాయి. వీటి షెడ్డు నిర్మాణం కీలకమైంది. 'సిల్క్ సమగ్ర–2' ద్వారా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా గాలి, వెలుతురు తగిన విధంగా ఉండేలా 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు కొలతలతో షెడ్డు నిర్మిస్తారు. ఈ షెడ్డు విస్తీర్ణం వెయ్యి చదరపు అడుగులు ఉంటుంది. ఒక పంట తీసిన వెంటనే మరో పంటకు సిద్ధం చేయడానికి డిస్‌ఇన్ఫెక్టడ్ చేస్తారు. రైతులకు అధికారులే అవసరమైన మందులు అందిస్తారు. డ్రిప్ సౌకర్యం కూడా ఉన్నది. రెయిన్‌గన్ల వినియోగంతో మ ల్బరీ ఆకు నాణ్యత పెరిగి మన్నికైన పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తున్నారు.

### ప్రోత్సాహకాలు.. రాయితీలు

పట్టు పురుగులు పెంచుతున్న రైతులకు ప్రోత్సాహకాలతో పాటు రాయితీ ఇస్తు న్నారు. పట్టుగూళ్లు ఉత్పత్తి చేసి అమ్మిన ప్రతి రైతుకు కిలోకు రూ.75 పోత్సాహకం ఇస్తున్నది. షెడ్డు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ. 2.92 లక్షలు, జనరల్‌కు రూ.2.25లక్షలు, డిస్‌ఇన్ఫెక్టెడ్ మందుల కోసం ఎస్సీ, ఎస్టీలకు రూ.1750, జనరల్ కు రూ. 2 500 అందిస్తున్నారు. మల్బరీ తోట నా టిన ఎస్సీఎస్టీ రైతులకు రూ. 50,700, జనరల్ రైతులకు రూ. 30వేలు ఇస్తున్నది. ప్రభుత్వ నర్సరీల్లో ఒక్కో మల్బరీ మొక్కను రూ.2చొప్పున రై తులకు ఇస్తున్నారు. కొత్తగా షెడ్డు నిర్మించిన రైతులకు 10ప్లాస్టిక్ ట్రేలు, 300ప్లాస్టిక్ నేత్రికలు అందిస్తున్నారు.

#### తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం..



ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర పంటలతో పో ల్చితే పట్టు సాగు లా భదాయకం.ప్రతి నెలా ఆదాయం వ స్తుంది. తక్కువ పెట్టుడితో మరో పది మందికి ఉపాధి కల్పించవచ్చు. నీటి వినియోగం అత్యల్పం. ప్రభుత్వం రైతులకు రాయితీ ఇస్తున్నది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతుల నుంచి పట్టుగూళ్లు కొనుగోలు చేస్తు న్నది. పట్టు గుడ్లు ఇచ్చినప్పటి నుంచి మార్కెట్‌లో విక్రయించేంత దాకా అధికారులు సహరిస్తున్నారు.

**- సింహాచలం యతీందర్, ఏడీ సెరికల్చర్**



జనగామలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయం

# ఊరి పేరే ఇంటి పేరుగా

- గోదావరిఖనికి పురుడు పోసిన 'గుళ్ల జనగామ'
- కాకతీయుల కళావైభవానికి సజీవ తోరణం
- మూడు నిలువెత్తు శివలింగాలున్న త్రిలింగ రాజ రాజేశ్వర స్వామి ఆలయం
- దాదాపు 100 కుటుంబాల ఇంటి పేరైన గ్రామం

గోదావరి నదీ పరీవాహక గ్రామం అది. కాకతీయ కళా వైభవానికి సజీవ తోరణం. ఆ ఊరుకు 12 వందల ఏండ్ల చరిత్ర. దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా మూడు నిలువెత్తు శివలింగాలున్న త్రిలింగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. అదే గుళ్ల జనగ్రామ గ్రామం. దాదాపు 700 కుటుంబాలు ఉన్న ఈ ఊరులో పేరును సుమారు వంద కుటుంబాలకు ఊరుపేరునే జనగామ ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. మరోవైపు నాటి జనగామే నేటి గోదావరిఖనికి పురుడు పోసిందని చెప్పుకోవడం విశేషం.



జనగామ గ్రామం

కోల్‌సిటీ, జూలై 3 : రామగుండం నగర పాలక సంస్థ 9వ డివిజన్ పరిధిలోని జనగామ గ్రామానికి కాకతీయుల చరిత్ర ఉంది. దాదాపు 1200 ఏండ్ల చరిత్ర కలిగిన ఈ గ్రామం, అప్పట్లో గుళ్ల జనగామగా పిలువబడేది. ఎక్కడైనా శివాలయాలు తూర్పు ద్వారంగా ఉండడం సహజం. కానీ, ఇక్కడ శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయం మాత్రం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి. దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేనివిధంగా ఈ ఆలయంలో మూడు నిలువెత్తు శివలింగాలు భక్తులకు దర్శనమిస్తుంటాయి. ఉత్తర భాగాన కి.మీ దూరంలో తూర్పు వాహినిగా గోదావరి నది కనిపిస్తుంది. ఈ ఆలయానికి ఉత్తరాన భీమేశ్వర ఆలయం, తూర్పున ఊర చెరువు, పోచమ్మ ఆలయాలు, దక్షిణాన హనుమంతుడి ఆలయం, పశ్చిమాన లక్ష్మీనారాయణ స్వామి ఆలయాలు దర్శనమిస్తాయి. అలాగే పశ్చిమాన గర్భాలయం ఆనుకొని వల్లుబండ కూడా ఉంటుంది. ఇక్కడ సంతాన లేమివారు పూజలు చేస్తే సంతానం ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

### జైనులు పాలించడంతోనే జనగామ

జైనులు ఈ గ్రామాన్ని పరిపాలించినట్లు చరిత్ర చెబుతున్నది. క్రమేణా ఈ ఊరు గుళ్ల జనగామగా మారింది. మహిమాన్వితమైన ఆలయాలు ఉండడం, పక్కనే గోదావరి నది ఉండడంతో గుళ్ల జనగామగా పిలిచేవారు. ఒకప్పుడు ఈ ఊళ్లో వర్షాలు పడడం లేదని జనగామ ఆలయంలో 11 మంది బ్రాహ్మణులు మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకం చేయడం వల్ల వర్షాలు పడి ఊర చెరువు నిండుకుండగా మారి రైతులు ఏటా రెండు పంటలు సాగు చేసే మహాభాగ్యం కలిగిందని చెబుతారు. ఈ ఆలయానికి తూర్పున కోనేరు ఉండేది. అది కాల క్రమేణా అంతరించిపోయింది. సమీపంలో ఉన్న గోదావరి నది నుంచి ఈ ఆలయం వరకు ఒక గుహ కూడా ఉండేదట. పూర్వం మునులు గోదావరి నదిలో స్నానమాచరించి ఆ గుహ ద్వారానే ఈ ఆలయానికి చేరుకునేవారని చరిత్ర చెబుతున్నది. ఇంకా ఇక్కడి భీమేశ్వరాలయం కింద మరో దేవాలయం కూడా ఉందని చెప్పుకుంటారు.

### వంద కుటుంబాలకు ఊరిపేరే

గ్రామంలో దాదాపు 700 చిలుకు కుటుంబాలు ఉండగా, అందులో 100 కుటుంబాలకు జనగామనే ఇంటి పేరుగా ఉన్నది. తమ పూర్వీకుల ఇంటి పేరు వేరుగా ఉన్నప్పటికీ రాను రానూ జనగామ వాళ్లు.. జనగామ వాళ్లు అంటూ పిలుస్తూ.. అదే ఇంటి పేరుగా స్థిరపడిపోయింది. మున్ముందు జనగామ ఇంటి పేరున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూనే ఉంటుందనడంలో సందేహం లేదు.

### ఎమ్మెల్యే కృషితో ఇప్పడిప్పడే అభివృద్ధి



గోదావరిఖని పుట్టిందంటే జనగామతోనే. సింగరేణికి పురుడు పోసింది కూడా జనగామే. జైనుల కాలం నాటి దేవాలయాలతో జనగామగా వచ్చింది. వెయ్యేండ్ల చరిత్ర కలిగిన జనగామను గత పాలకులు పట్టించుకోలే. స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చొరవతో జనగామ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నది. పురాతన, మహిమాన్వితమైన శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న ఈ ఊరు పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిని కోరుతున్నాం.

**- ధాతు శ్రీనివాస్, కార్పొరేటర్ (8వ డివిజన్ )**

### మా ఇంటి పేరూ జనగామే



నేను ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ జనగామ ఊరే మా ఇంటి పేరు. ఎక్కడైనా పరిచయం చేసుకునే సందర్భం వస్తే జనగామ కవితగా చెప్తా. మొదట్లో ఊరు పేరు అనుకుంటారు. తర్వాత ఇంటి పేరు కూడా అదేనని తెలుసుకొని ఆశ్చర్యపోతారు. జైనులు పాలించిన గ్రామంగా జనగామగా పేరువచ్చిందని పూర్వీకులు చెబుతుంటే విన్నాను. ఈ గ్రామంలో జనగామ ఇంటి పేరుతో చాలా మంది ఉన్నారని మొదట తెలిసి నేనూ ఆశ్చర్యపోయాను.

**- కవితా సరోజని, కార్పొరేటర్ (9వ డివిజన్)**

# బాలల హక్కులను సంరక్షిద్దాం

తెలంగాణ చౌక్, జూలై 3: ఎవరైనా చిన్నారులను బలవంతంగా భిక్షాటన, వెట్టిచాకిరీ చేయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, బాలల హక్కులను సంరక్షిద్దామని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం సిరిసిల్లలోని పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్–9కి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్ ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఆపరేషన్ ముస్కాన్–9ను విజయవంతం చేయాలని సూచించారు. 18 ఏండ్ల లోపు పిల్లలు బాల కార్మికులు పనిచేస్తే, వెంటనే గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్టేట్ హోమ్‌లకు తరలించాలన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే డయల్100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్